## క్లుప్తంగా

### విజయపురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓగా జెడ్పీ కార్యాలయ పర్యవేక్షకులు ప్రసాద్‌ను నియమిస్తూ జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న సతీష్ అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆ స్థానాన్ని భర్తీ చేయాలనిమంత్రి రోజా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులను కోరారు. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేశారు.

### జనుము విత్తనాల పంపిణీ

నగరి: స్థానిక వ్యవసాయం కార్యాలయంలో జనుము విత్తనాలను ఎంపీపీ భార్గవి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందించే జనుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ భూమి పాసుపుస్తకాలు తీసుకుని వచ్చి వ్యవసాయ కార్యాలయంలో గానీ, ఆర్బీకేలలో గానీ విత్తనాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీ ప్రదీప్‌యేసు, సర్పంచులు పరంధామన్, వెంకటేశు, ఏఓ రాఘవేంద్ర యాదవ్, మండల సచివాలయ కన్వీనర్ హరి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500 మార్కుల కంటే ఎక్కువ సాధించిన విద్యార్థులు ధనుష, ధారావిని బుధవారం హెచ్‌ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి విద్యార్థులను పిలిచి దుశ్శాలువలతో వారిని సన్మానించారు.

### విశ్రాంత లైన్‌మెన్ మృతి



గజేంద్రుడు (ఫైల్)

పుత్తూరు రూరల్: పట్టణానికి చెందిన ఏపీఎస్‌పీడీసీఎల్ రిటైర్డ్ సీనియర్ లైన్‌మెన్ పి.గజేంద్రుడు(65) బుధవారం కన్నుమూశారు. 1104 పుత్తూరు యూనియన్ ప్రెసిడెంట్‌గా అందరి మన్ననలు పొందిన ఈయన 2018లో రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం స్థానిక గంగ జాతర కమిటీ నిర్వాహకులుగా సేవలు అందిస్తున్నారు. ఈయన మృతికి పలువురు విద్యుత్ శాఖ అధికారులు, పలు ఆలయాల కమిటీ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

### ఆర్బీకేలకు చేరిన సబ్సిడీ వేరుశనగ

శ్రీరంగరాజపురం: ఖరీఫ్‌లో వేరుశనగ పంటలు వేసుకోవడానికి అనుకూలమని రాష్ట్రప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు బుధవారం రైతుభరోసా కేంద్రాలకు చేరాయని ఏఓ చిట్టిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్-2023లో పంటలు వేయడానికి అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. దీనికితోడు వర్షాలు కూడా తోడు కావడంతో వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. సాధారణంగా మన జిల్లాలో జులైలో వేరుశనగ, వరి పంటలు సాగు అవుతాయన్నారు. ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు పడడంతో వర్షాధారం కింద సాగు అయిన వేరుశనగను జూన్‌లోనే వేసుకోవడానికి రైతులు సిద్ధపడుతున్నారు. దీనికి అనుగుణంగా విత్తనాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం మండలానికి 810 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలకు 200 క్వింటాళ్లు చేరాయని, త్వరలో మరిన్ని క్వింటాళ్లు వస్తాయన్నారు. 30 కేజీల సంచి సబ్సిడీ పోనూ రూ.1,674 ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వైభవంగా గంగజాతర



ముడిపల్లెలో కొలువైన గంగమ్మ



కీళపట్టులో కొలువుదీరిన గంగమ్మ, పొన్నెమ్మ అమ్మవార్లు



గంగమ్మను దర్శించుకుంటున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి : పల్లెల్లో గంగ జాతర వైభవంగా జరిగింది. మండలంలోని ముడిపల్లి, వీకేఆ ర్ పురం, గుడికంద్రిగ, మిట్టపాళెం, మూలనత్తం, ఎం.కొత్తూరు, కృష్ణారామాపురం గ్రామాల్లోను మునిసిపల్ పరిధి కీళపట్టు, కరకంఠాపురం ప్రాంతాల్లో బుధవారం గంగ జాతర వైభవంగా జరిగింది. వేకువజామున గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వీధినాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధి క సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణం చేశా రు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మకు నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. బలి అన్నం సమర్పించి రాత్రి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు. జాతర మొక్కుల్లో భాగంగా కరకంఠాపురంలో శరీరానికి కొక్కీలు తగిలించుకొని చూస్తేనే ఒళ్లు గగుర్పొడిచేలా భక్తులు వాహనాలకు వేలాడటం పలువురిని ఆశ్చర్యపరిచింది. అమ్మవారిని మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




ఇనుప కొక్కీలకు వేలాడుతూ వస్తున్న భక్తులు



కరకంఠాపురంలో గంగమ్మ ఊరేగింపు

### మీరు కొడితే సిక్సరే..



కళ్లజోడు పెట్టి.. చేతిలో బ్యాట్ పట్టుకుని యువకుడిలా కనిపిస్తున్న ఈయన ఎవరో కాదు.. నిత్యం ప్రజాసేవలో పరితపించే నాయకుడు.. ప్రతిపక్షాలను మాటల తూటాలతో చెడుగుడు ఆడే మన డిప్యూటీ సీఎం నారాయణస్వామి. బుధవారం ఆయన తుమ్మలగుంట మైదానంలో జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్ టోర్నీలో భాగంగా మ్యాచ్‌లను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా బ్యాటింగ్ చేసి ఆటగాళ్లను ఉత్సాహ పరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి చెవిరెడ్డి ఫ్యామిలీ ఇంత పెద్ద టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు.

## ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

నగరి: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు హెచ్‌ఎం కుప్పరాజు తెలిపారు. బుధవారం రామ్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు, సీఆర్పీలతో పాటు పర్యటించిన ఆయన ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక కిట్, పాఠ్యపుస్తకాలు ఇతర ప్రోత్సాహకాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వాణి, మహిళా పోలీస్ సునీత, విద్యా కార్యదర్శి మురళి, వెల్ఫేర్ అసిస్టెంట్ సెక్రటరి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు సలీమా, మీన, వలంటీర్లు మోనికా, గిరి, మణి తదితరులు పాల్గొన్నారు.



నంబాకంలో ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం

మండలంలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిధిలో హెచ్‌ఎం వనిత కుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేశారు.

### ఆరేటమ్మ ఆలయానికి ఆర్చి నిర్మాణం

పుత్తూరు రూరల్: గ్రామదేవత ఆరేటమ్మ ఆలయ ముఖద్వారంగా నిర్మిస్తున్న ఆర్చి మోల్డింగ్ పనులను బుధవారం వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన కలిగిన పలువురు దాతల ఆర్థిక సాయంతో ఆర్చి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. సుమారు రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఆర్చిని అమ్మవారి విగ్రహంతో అద్భుతంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామిరెడ్డిని ఆలయ కమిటీ తరఫున చైర్మన్ మనోహర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ డి.శంకర్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, ఆలయ కమిటీ సభ్యులు చిన్నా, నాయకులు ఏకాంబరం, కుట్టీ, బుజ్జీ, చిరంజీవి, శివ, జయబాబు, రవికుమార్, కడియాలనాయుడు పాల్గొన్నారు.

## ప్రజలకు గంగమ్మ దీవెనలు ఉండాలి



ఉగ్రాణపల్లిలో నడివీధి గంగమ్మను దర్శించుకుంటున్న నారాయణస్వామి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మ వారిని కోరుకున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఉగ్రాణపల్లిలో వెలసిన నడివీధి గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనలో ప్రజలు సుఖసంతోషంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు డిప్యూటీ సీఎంను ఆశీర్వదించి, అమ్మవారి ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మురళీరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ జమున, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ఓటీఎస్ లబ్ధిదారులతో కుమారస్వామిరెడ్డి

- మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- 259 మందికి ఆస్తి పత్రాల పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పుత్తూరు రూరల్ పరిధిలోని 259 మంది లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం కింద రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటీఎస్ పథకం పేరిట పేదలకు ఆస్తి పత్రాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్రను సృష్టించారని తెలిపారు. ఈ బృహత్తర పథకాన్ని ప్రతిపక్ష టీడీపీ అడ్డుకోవడానికి ప్రయత్నించి విఫలమైందన్నారు. సొంతింటిపై సర్వ హక్కులు పొందడమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకమని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సదరు పత్రాల ద్వారా బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏఓ వాణి, ఎంఈఓ తిరుమలరాజు, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి, రాంబత్తయ్య, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

### అంతఃపరిశుభ్రత అవసరం



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న పుల్లయ్య గురూజీ

నగరి: శరీరానికి బాహ్య పరిశుభ్రత ఎంత అవసరమో అంతఃపరిశుభ్రత కూడా అంతే అవసరమని యోగా గురువు పుల్లయ్య తెలిపారు. నగరి పట్టణంలో చిన్నారులకు అందిస్తున్న యోగా శిక్షణలో భాగంగా బుధవారం ఆరోగ్యం విషయంలో ఆచరించవలసిన నియమాలపై ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలోని అవయవాలను పరిశుభ్రం చేయడం యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. పాము కాటుకు భయపడని మనిషి దోమకాటుకు మరణిస్తున్నాడని మనిషిలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గదలే దీనికి ప్రధాన కారణమన్నారు. అందుకు జీవన విధానంలో లోపమే మరో కారణమన్నారు. వీటన్నిటికీ పరిష్కార మార్గం యోగా అని తెలిపారు. యోగా రీసోర్స్‌పర్సన్లు బాబు, ఎల్లప్పరెడ్డి, హరిహరన్, అయ్యప్పన్, మీనాక్షిసుందరం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

విజయపురం (నగరి): మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణుల్లో రక్తహీనతను నివారించవచ్చని డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్‌తో పాటు రక్తహీనత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిమోగ్లోబిన్ పెరగాలంటే ఐరన్ ఉండే ఆహార పదార్థాలు తరచుగా తీసుకోవాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్, ఖర్జూరం, తృణధాన్యాలు, పప్పు దినుసులు, బీన్స్, కోడిగుడ్లు పాటు మాంసం, చేపలు వంటి వాటిల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుంచి ప్రతి గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నామని గుర్తు చేశారు. అలాగే గర్భిణులు వైద్యుల సలహా మేరకు ముందుగా పరీక్ష ద్వారా రక్తహీనతను నివారిస్తే కాన్పు సమయంలో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. సీహెచ్‌ఓ సుబ్బరామమ్మ, ఎంపీహెచ్‌ఈఓ జనార్ధన్, శివముణి, పీహెచ్‌ఎన్ అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ

### ఇంత మంచి ఎవరూ చేయలేదు



పౌష్టికాహారంతో గర్భిణులు

నగరి: 'ఎవరూ చేయని మంచి మంత్రి రోజా చేస్తున్నారు.. ఆమె నాలుగు కాలాల పాటు చల్లగా ఉండాలి' అంటూ మంత్రి రోజాకు పలువురు మహిళలు కృతజ్ఞతలు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చినప్పుడు వేచి ఉండే గర్భిణులకు గత కొన్ని నెలలుగా మంత్రి ఆర్‌కే రోజా పౌష్టికాహారం అందిస్తున్నారు. బుధవారం చికిత్స నిమిత్తం నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు. నగరి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్‌ఎంఓ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు. పుత్తూరులో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శంకర్ నరేన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణ స్వామి, పుష్పమ్మ పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ



ముమ్మరంగా జరుగుతున్న విగ్రహావిష్కరణ ఏర్పాట్లు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈమేరకు ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో పెద్దఎత్తున భారీ బహిరంగ సభ, సుమారు రెండువేల మందికి భోజన వసతి కల్పించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్షల్లో 500 పైచిలుకు మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందించనున్నారు. ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించగా గురువారం మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరానున్నారు.